## క్లుప్తంగా

### నేడు మండల సర్వసభ్య సమావేశం

**రామాపురం :** మండల సర్వసభ్య సమావేశం స్థానిక ప్రజా పరిషత్ సభా భవనంలో మంగళవారం ఉదయం 10గంటలకు మండల అధ్యక్షురాలు గడికోట విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ హైదర్‌వలీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ సభ్యులు, కోఆప్షన్, మండల స్థాయి అధికారులు హాజరుకావాలని తెలియజేశారు. ఈ సమావేశంలో వివిధ శాఖల పనితీరుపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

### పాఠశాలకు డెస్కుల వితరణ

**సంబేపల్లె :** మండలంలోని అడవికమ్మపల్లె జెడ్పీ హైస్కూల్‌కు రోటరీ క్లబ్ సభ్యులు సోమవారం 10 డెస్కులను అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ రెడ్డెన్న, క్లబ్ అధ్యక్షురాలు అనసూయదేవిలు మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలకు డెస్కులు అందజేశామన్నారు. ఇదే సమయంలో పాలెంగడ్డ పాఠశాల పిల్లలకు ఉచితంగా బట్టలను పంపిణీ చేశామన్నారు. విద్యార్థులు చదువులో బాగా రాణించాలంటూ పిలుపునిచ్చారు. ఈ యేడాది నిర్వహించే టెన్త్ పరీక్షలలో ప్రతిభను కనపరిచే విద్యార్థులకు క్లబ్ తరపున ప్రోత్సాహక బహుమతులను అందజేయనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ రియాజ్, విశ్వ జవహర్‌తోపాటు క్లబ్‌సభ్యులు, సీపీఐ రాయచోటి నేత సిద్దిగాళ్ళ శ్రీనివాసులు, పాఠశాల హెచ్‌ఎం జయచంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పరామర్శ

**రామాపురం :** మండలంలోని గువ్వలచెరువు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పుల్లయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం తెల్లవారుజామున ఆయన మరణించాడు. స్థానిక నేతల ద్వారా విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి మృతుడి స్వగృహానికి చేరుకొని మృతదేహానికి నివాళి అర్పించారు. మృతికి కారణాలు తెలుసుకొని, అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో వైఎస్సార్‌సీపీ నాయకులు లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ కర్లపు విశ్వనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటరమణ, డాక్టర్ రమణ, ముబారక్, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### క్యాలెండర్ల ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న డీఐఈఓ క్రిష్ణయ్య,అధ్యాపకులు

**రాయచోటి అర్బన్ :** అన్నమయ్య జిల్లా ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం క్యాలెండర్‌లను సోమవారం డీఐఈఓ క్రిష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానంటూ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగసురేష్, జనరల్ సెక్రటరీ రమణయ్య, ఉపాధ్యక్షుడు రఘురామయ్య, జోనల్ అధ్యక్షుడు రాధాక్రిష్ణ, ట్రెజరర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### వాతావరణ మార్పుల వల్లే జ్వరాలు



డాక్టర్ మధుశేఖర్

**సిద్దవటం :** వాతావరణంలోని మార్పుల వల్ల జ్వరాలు సోకుతున్నాయని సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డా.మధుశేఖర్ తెలిపారు. ఆసుపత్రిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంచు ప్రభావం వల్ల జలుబు, దగ్గు, సోకి జ్వరాలు వస్తున్నాయన్నారు. జ్వరాలు సోకినవారు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను సంప్రదించాలన్నారు. జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నీ జబ్బులకు మందులు అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ముందుజాగ్రత్తలు పాటిస్తూ వ్యాధులు దరి చేరకుండా చూసుకోవాలని సూచించారు.

### భూ వివాదంపై ఘర్షణ

**రామాపురం :** మండలంలోని చిట్లూరు పంచాయతీ పాలన్నగారిపల్లెకి చెందిన ఈశ్వర్ రెడ్డి, పాలకొండ రెడ్డి, మరో ఇద్దరు మహిళలు సోమవారం భూమి విషయంపై ఇరువర్గాలు ఘర్షణ పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో సాయి ప్రతాప్‌రెడ్డి, శంకర్‌రెడ్డిలకు గాయాలైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ప్రమాదంలో యువకునికి గాయాలు

**సంబేపల్లె :** చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యవకునికి గాయాలైన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకొంది. స్థానికుల వివరాల మేరకు కలకడ మండలం అక్కన్నకోటకు చెందిన ఆనంద్ అనే యువకుడు ద్విచక్రవాహనంలో రాయచోటి నుంచి కలకడకు వెళుతుండగా మోటకట్ల సమీపంలోకి రాగానే ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడిందన్నారు. స్థానికుల సహాయంతో ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం తరలించినట్లు సమాచారం.

# సంక్షేమం అపారం.. సేవలు సత్వరం

లేబాకలో గడప గడప కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



నందలూరు: లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డి



వీరబల్లి: ఎంపీటీసీ నివాసం వద్ద ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

**నందలూరు(రాజంపేట) :** రాష్ట్రంలో ప్రజలు మెచ్చే పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి అన్నారు. నందలూరు మండలంలోని లేబాక గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ప్రజాదరణ లభిస్తుందన్నారు. ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వినూత్నంగా సంక్షేమ పథకాలను తీసుకొచ్చారన్నారు. పాలన కోసం సచివాలయం వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ప్రజలకు గ్రామస్థాయిలోనే సేవలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. అన్నీ రకాల వర్గాలకు మేలు జరిగేలా నవరత్నాల పథకం ద్వారా లబ్ధిచేకూరేలా చేశారన్నారు. నందలూరు ఎంపీపీ మేడా విజయ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో ప్రజలకు ప్రజాప్రతినిధులు ఎన్నికల ముందు కనిపించేవారని, ఆతరువాత కనిపించేవారు కాదన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలు లేకపోయినా ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకోండని తమను ప్రతి గడపకు పంపారని తెలియజేసినట్లు చెప్పారు. సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లేబాక ఇన్‌చార్జి సర్పంచ్ నరసయ్య, నేతలు అన్నం నాగేంద్ర, సంజీవి, మాజీ ఎంపీపీ లక్ష్మినరసయ్య, జిల్లా వక్ఫ్‌బోర్డు ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, టంగుటూరు సర్పంచ్ మైనుద్దీన్, దళిత నాయకులు బొక్కే రమణ, ఆర్ముగం విశ్వనాథ్, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు నడివీధి సుధాకర్, మోదుగుల చంద్రశేఖర్, ఎంపీడీఓ సౌభాగ్యమ్మ, వివిధశాఖల అధికారులు, వలంటీర్లు, పాల్గొన్నారు.

నందలూరు మండలం లేబాక గ్రామంలో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి, ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డిలకు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే రాకతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. గ్రామంలో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యేకు ప్రజల నుంచి ఆదరణ లభించింది.

**అంగన్‌వాడీలు లక్ష్యాలను అధిగమించాలి**

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించిన ఎమ్మెల్యే స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించారు. ఇతరత్రా అడిగి తెలుసుకున్నారు. అనంతరం గర్భిణులకు నిర్వహించిన సీమంతాల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని గర్భిణులను ఆశీర్వదించారు.

**జాతరను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి**

**వీరబల్లి :** మండలంలోని ఓదివీడు గ్రామంలో మంగళవారం నిర్వహించనున్న ఓదేటమ్మ దేవర జాతరను ప్రజలు, భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జున రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలు సూచించారు. ఓదివీడు గ్రామంలో పలు నాయకులు ఏర్పాటు చేసిన విందును వారు ఆరగించారు. జాతరలోని గంగమ్మ దేవాలయం వద్ద నిర్వహించిన పూజలలో వారు పాల్గొన్నారు. అడుగడుగునా వారికి ప్రజలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలుకుతూ పూలమాలలతో, దుశ్శాలువాలతో వారిని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతరలో ఎలాంటి సంఘటన చోటుచేసుకోకుండా అందరూ కలిసిమెలసి జరుపుకోవాలని ప్రజలను, భక్తులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, ప్రముఖ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గాలివీటి విజయభాస్కర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు వీరనాగిరెడ్డి, గ్రామ సర్పంచ్ శంకరమ్మ, ఎంపీటీసీ చమర్తి శ్రీదేవి, మాజీ సర్పంచ్ మాహబూబ్‌బాషా, పి.ఇస్మాయిల్ బాషా, అన్సర్ బాషా, సారథిరాజు, సుబ్బరామరాజు, శివ, అష్రఫ్ ఆలీ, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు దంత పరీక్షలు



దంత పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**సిద్దవటం :** పార్వతీపురంలోని ఎస్. పి. బి.వి.డి. సభా హైస్కూల్‌లో పాఠశాల హెచ్‌ఎం ఎండీ మధుసూదన్ ఆధ్వర్యంలో ఆ పాఠశాల విద్యార్థులకు ప్రాథమిక దంత పరీక్షలు నిర్వహించారు. సోమవారం కడప రిమ్స్ దంత వైద్య కళాశాల వారు హైస్కూల్‌లో ఉచిత దంతవైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిమ్స్ దంత వైద్య నిపుణులు ప్రొఫెసర్ డాక్టర్ బి.విజయలక్ష్మి, హౌస్ సర్జన్ డాక్టర్ ఎ.వంశీసాయి, డాక్టర్ చంద్రహాసరెడ్డి, డాక్టర్ నాగశిరీష, సింధు, నాగవైష్ణవి వనితాశ్రీ, సాయిక్రిష్ణలు పాఠశాలలోని విద్యార్థినీ, విద్యార్థులకు 180 మందికి ప్రాథమిక దంత పరీక్షలు నిర్వహించడంతోపాటు ఉచిత మందులు, టూత్ పేస్టులు అందజేశారు. అత్యవసర దంత చికిత్స అవసరమైన వారిని రిమ్స్‌కు రెఫర్ చేయడం జరిగిందని డాక్టర్ వంశీసాయి తెలిపారు. అంతేగాకుండా ఉపాధ్యాయులకు, గ్రామస్తులకు దంతపరీక్షలను నిర్వహించామని డాక్టర్ వంశీసాయి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు ఎండీ ప్రసాద్, ఉపాధ్యాయులు బి. పోలిరెడ్డి, యు.పి.రాయుడు, శ్రావణ్, విశ్వనాథ్, అమరావతి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం



పుల్లంపేట: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



సిద్దవటం: ప్రమాణం చేయిస్తున్న శివకుమార్

**సిద్దవటం :** ప్రతి ఒక్కరూ కుష్ఠువ్యాధిపై అవగాహన అవసరమని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డా.శివకుమార్ తెలిపారు. సిద్దవటం మండలం భాకరాపేటలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో డాక్టర్ శివకుమార్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సర్పంచ్ ప్రతినిధి తుర్రా ప్రతాప్, ఉపసర్పంచ్ భర్త నాగం నరసింహారెడ్డి, మాధవరం పీహెచ్‌సీ సిబ్బంది మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కుష్ఠువ్యాధిపై అవగాహన కల్పించి వారితో ప్రమాణం చేయించామన్నారు. కుష్ఠ వ్యాధి రహిత గ్రామంగా తీర్చిదిద్దుకోవాలని, వ్యాధి సోకిన వ్యక్తులపై వివక్షత చూపరాదని వైద్యుడు శివకుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓ నాని, ఏఎన్‌ఎం రాణి, ఆశ వర్కర్‌లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

**కుష్ఠ రహిత సమాజానికి కృషి చేయండి**

**వీరబల్లి :** కుష్ఠ రహిత సమాజ నిర్మాణానికై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ డాక్టర్ వినయ్ బాబు పేర్కొన్నారు. సోమవారం కుష్ఠువ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్ఠువ్యాధి సోకిన వారు క్రమం తప్పకుండా మందులు వాడటం, వైద్యుల సలహాలు, సూచనలు పాటించడంతోపాటు పౌష్టిక ఆహారం తీసుకోవడం వల్ల పూర్తిగా నయం చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గంగాదేవి, హాస్పిటల్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పుల్లంపేటలో ర్యాలీ**

**పుల్లంపేట :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం డాక్టర్ మనోజ్ చంద్ర ఆధ్వర్యంలో జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోజ్‌చంద్ర మాట్లాడుతూ కుష్ఠువ్యాధి మైక్రో బ్యాక్టీరియా లెప్రసీ అనే సూక్ష్మ క్రిమి ద్వారా వ్యాపిస్తుందని, శరీరంపై స్పర్శలేని మచ్చలు, చెవులు, వీపు నొప్పిలేని బుడిపెలు ఈ వ్యాధి లక్షణాలని, కుష్ఠువ్యాధి గ్రస్తులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు మరొకరికి ఈ వ్యాధి సోకుతుందని, ఈ వ్యాధి బయటపడటానికి 3 నుంచి 5 సంవత్సరాలు పడుతుందన్నారు. ఈ వ్యాధికి అన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో మందులు ఉచితంగా లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజ, సీహెచ్‌ఎస్ అరోరమ్మ, శరత్ చంద్ర రాజు, మహేష్, ఫార్మసిస్టులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### జంతువుల పట్ల జాలి, దయ కలిగివుండాలి

**రాజంపేట రూరల్ :** జంతువుల పట్ల ప్రతి ఒక్కరూ జాలి, కరుణ, దయ కల్గి ఉండాలని పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకులు(డీడీ) డాక్టర్ మహమ్మద్ అబ్దుల్‌ఆలీ కోరారు. పట్టణ శివార్లలోని నారపురెడ్డి పల్లి ప్రాథమిక పాఠశాలలో జంతు సంక్షేమ పక్షోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం విద్యార్థులకు జంతు సంక్షేమ కార్యక్రమాల గురించి అవగాహన కార్యక్రమాన్ని పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపసంచాలకులు అబ్దుల్ ఆలీ జంతువుల వలన మానవాళికి కలిగే ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. జంతువులను ఎలా రక్షించుకోవాలో తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఉన్నారు.

### గోవుల దహన సంస్కారాలకు స్థలం మంజూరు చేయండి

**రాజంపేట రూరల్ :** పట్టణంలో మృతి చెందుతున్న గోవులకు దహన సంస్కారాలు నిర్వహించేందుకు స్థలం మంజూరు చేయండంటూ గోసేవ సమితి సభ్యులు కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డికి, డీఈ ఈశ్వరరెడ్డికి సోమవారం ఈ మేరకు గోసేవ సమితి సభ్యులు వినతిపత్రం అందజేసి కోరారు.

### వైభవంగా రథోత్సవం



రథంపై ఊరేగుతున్న ఆంజనేయ స్వామి

**నందలూరు(రాజంపేట) :** కుంపిణీపురం ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తిని సుందరంగా అలంకరించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవమూర్తిగా రథంపైకి తీసుకొచ్చారు. స్వామి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. అనంతరం గ్రామ పుర వీధుల్లో ఊరేగిన ఆంజనేయ స్వామిని భక్తులు దర్శించుకుని, కాయాకర్పూరం సమర్పించారు.

### కనుల పండువగా పల్లకీ సేవ

**రాయచోటి :** పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో సోమవారం పల్లకీసేవ కనుల పండువగా సాగింది. ఆలయ చైర్మన్ పోలం రెడ్డి విజయమ్మ, ఈఓ డీవీ.రమణారెడ్డి ఉత్సవాన్ని పర్యవేక్షించారు. పల్లకీసేవలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. చింతం రాజారెడ్డి ఆర్థిక సహాయంతో బోరుబావిని తవ్వించినట్లు ఆలయ చైర్మన్ విజయమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు నాగభూషణం, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకతీతం.. సంక్షేమమే ధ్యేయం



సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

పందికుంటలో గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

**గాలివీడు :** ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందని రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పార్టీలకతీతంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధిదారులు పిల్లలను చదివించుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెంది సంతోషంగా ఉన్నామని మహిళలు ఎమ్మెల్యే ఎదుట సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం పందికుంట గ్రామంలోని దేవరపల్లె, చావిడిపల్లె, వెంకటాపురం, హరిజనవాడ, రాములపల్లె, పుష్పగిరి, బాలంరెడ్డిగారిపల్లెలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

**పారదర్శకతతో పథకాలు**

ప్రభుత్వం గ్రామాల్లో పార్టీలకతీతంగా అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎలాటి సిఫార్సులు లేకుండా రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం జన్మభూమి కమిటీల సిఫార్సుతో తమ పార్టీ వారికే పథకాలు అందాయని, నేడు అలాంటి పద్ధతి లేకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలందుతున్నాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు మిట్టపల్లె యదుభూషన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గుమ్మా అమరనాథరెడ్డి, సర్పంచ్ ఉమాపతిరెడ్డి, హనుమాన్ నాయక్, చెన్నకేశవరెడ్డి, ఉమాప్రభాకర్, రామాంజుల రెడ్డి, జానకమ్మ, ఎంపీటీసీలు జనార్ధన్ రెడ్డి, ముత్యాలమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు భానుమూర్తి రెడ్డి, మాజీ సర్పంచ్ ఖాసీం, బీసీ నాయకులు శివగంగాధర్, నాగశేఖర్ నాయుడు, రామకృష్ణమనాయుడు, గోపాలనాయుడు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

## నష్టపరిహారం, పునరావాసం కల్పించండి



పునరావాసం కల్పించాలని సీపీఓను కోరుతున్న సీనియర్ నాయకులు హరినాథ్‌రెడ్డి, గ్రామస్తులు

**ఓబులవారిపల్లె :** మంగంపేట కాపుపల్లె, హరిజనవాడ ఆరుంధతివాడ మూడు గ్రామాలలో ఏపీఎండీసీ గనుల నుంచి వెలికితీసే మట్టితో ప్రతి నిత్యం అల్లాడిపోతున్నామని, వెంటనే పునరావాసం కల్పించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గుత్తిరెడ్డి హరినాథ్‌రెడ్డి, గ్రామస్తులు సీపీఓ వెంకటరమణను కోరారు. స్థానిక ఏపీఎండీసీ కార్యాలయంలో సీపీఓ వెంకటరమణతో సీనియర్ నాయకులు గుత్తిరెడ్డి హరినాథ్‌రెడ్డి, గ్రామస్తులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ మూడు గ్రామాల తరలింపునకు ఏపీఎండీసీ అన్ని విధాలా సహకరించాలని, గ్రామాలకు పునరావాసం కల్పించేందుకు ఆలస్యం చేస్తున్నారన్నారు. మా భూములలో ఏపీఎండీసీ నుంచి వెలికి తీసిన వృథా మట్టిని తరలించడం ద్వారా గ్రామంలో దుమ్మూధూళి పేరుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు గ్రామాలకు వెంటనే నష్టపరిహారంతోపాటు పునరావాసం కల్పించాలని, లేనిపక్షంలో మట్టి తరలింపును ఏపీఎండీసీ అధికారులు నిలిపివేయాలన్నారు. వచ్చే వేసవి కాలంలో దుమ్ము వలన రోగాలతో గ్రామాలలో ఉండలేమని వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. ఇందుకు సీపీఓ వెంకటరమణ మాట్లాడుతూ గ్రామస్తుల సమస్యలను ఎండీ వీజీ వెంకటరెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మినుగు సుధాకర్, ఎంపీటీసీ హరిబాబు, దేవ కుమార్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, మురళీ, వెంకటసుబ్బారెడ్డి, నరసింహులు, మణి, మురళీ పాల్గొన్నారు.


## 'ముదివేడు' నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి



డీఆర్‌ఓ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

**రాయచోటి అర్బన్ :** ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం అన్నమయ్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వాసితులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిహారం చెల్లించకుండానే రిజర్వాయరు నిర్మాణం పనులు పూర్తవుతున్నా అధికారులు స్పందించడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రిజర్వాయర్ ముంపు ప్రాంత రైతులు భూములు, ఇళ్ళు కోల్పోయి ఆవులు, మేకలు, గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారంటూ తెలిపారు. నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించడంతోపాటు పునరావాసం కల్పించాలంటూ డిమాండ్ చేశారు. నిరాశ్రయులైన భూమిలేని వ్యవసాయ కూలీలకు సైతం ఆదుకోవాలన్నారు. సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామచంద్ర, కెవిపిఎస్ జిల్లా కో–కన్వీనర్ డిసి వెంకటయ్య తదితరులు నిర్వాసితుల నిరసనకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఈమేరకు డీఆర్‌ఓ సత్యనారాయణకు వినతిపత్రం సమర్పించారు.

## ముఖగుర్తింపు హాజరు విధానాన్ని రద్దుచేయండి



కలెక్టరేట్ ఎదుట ధర్నాచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు

**రాయచోటి అర్బన్ :** మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు ముఖగుర్తింపు హాజరు అమలు విధానాన్ని వెంటనే రద్దుచేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, సురేష్‌కుమార్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివలు డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు సోమవారం మున్సిపల్ కార్మికులు జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు చాలామందికి ఫోన్‌లు లేవని, వినియోగించడం తెలియని కార్మికులపై ప్రభుత్వ విధానాలు బలవంతంగా రుద్దడం మానుకోవాలంటూ కోరారు. కార్మికుల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులను వెంటనే పర్మనెంట్ చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు బి.వి.రమణ, కేశవరావు, బి.వి.లక్ష్మిదేవి, నాగరాజు, వాసు, వరప్రసాద్, గోపాల్, ఇంద్రాణి, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమోషన్ ఇవ్వకుండా ఇంటర్వ్యూలు వద్దు

**రాయచోటి అర్బన్ :** అర్హత ఉన్న అంగన్‌వాడీ సహాయకులకు కార్యకర్తలుగా ప్రమోషన్‌లు ఇచ్చేవరకు కొత్తగా అంగన్‌వాడీ కార్యకర్తల నియామకం జరపకూడదని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీలక్ష్మి, రాజేశ్వరిలు డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్నం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ సమావేశం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో శ్రీలక్ష్మి, రాజేశ్వరిలు మాట్లాడుతూ అర్హత ఉన్న అంగన్‌వాడీ సహాయకులకు కార్యకర్తలుగా ప్రమోషన్ ఇచ్చేవరకు పోరాడతామన్నారు. అవసరమైతే ఇంటర్వ్యూలను అడ్డుకుంటామంటూ వారు హెచ్చరించారు. సకాలంలో జీతాలు చెల్లించాలని, పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలంటూ కోరారు. అంగన్‌వాడీ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 6న నిర్వహించే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలంటూ కోరారు. యూనియన్ జిల్లా కోశాధికారి బంగారు పాప, అన్ని ప్రాజెక్టుల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యులు నాగమణి, ఖాజాబి, వనజ, మధురవాణి, స్వరూపరాణి, గౌరీ, ఓబులమ్మ పాల్గొన్నారు.

## రీ సర్వేను త్వరగా పూర్తి చేయండి



రీ సర్వేపై సూచనలు చేస్తున్న తహసీల్దార్ మురళీకృష్ణ

**చిట్వేలి :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వేను త్వరగా పూర్తి చేయాలని తహసీల్దార్ మురళీకృష్ణ సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమం అనంతరం రీసర్వే, సకాలంలో సర్టిఫికెట్ల జారీ, వ్యవసాయ గణన వంటి అంశాలపై సర్వేయర్లు, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వేలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని, అలాగే వ్యవసాయ గణన సకాలంలో పూర్తి చేయాలని, సర్టిఫికెట్ల జారీలో ఆలస్యం చేయవద్దని, రేషన్ కార్డులను సంబంధిత లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ శేషంరాజు, సర్వేయర్ బాలసుబ్రమణ్యం, సీనియర్ అసిస్టెంట్లు రాంబాబు, రామసుబ్బారెడ్డి, వీఆర్‌ఓలు, గ్రామ సర్వేయర్లు, గ్రామ వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ ఆశయాలతో ముందుకు సాగాలి

గాంధీజీ చిత్రపటానికి నివాళి అర్పించిన ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి



రాజంపేట టౌన్: గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి



రైల్వేకోడూరు అర్బన్: గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**రాజంపేట :** గాంధీజీ ఆశయాలతో ముందుకు సాగాలని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. సోమవారం మేడా భవన్‌లో మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా రాజంపేట ఎమ్మెల్యే మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గాంధీజీ సత్యము, అహింసా సిద్ధాంతాలతో సహాయ నిరాకరణ, సత్యాగ్రహం ఆయుధాలతో రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గుల్జార్ బాషా, రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రి మాజీ చైర్మన్ వడ్డే రమణ, వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు కుందా నెల్లూరు వెంకటేశ్వర్‌రెడ్డి, పాలగిరి మల్లికార్జునరెడ్డి, గౌడ్ సంఘం డైరెక్టర్ ముద్ద సుబ్రమణ్యం గౌడ్, వైఎస్‌ఆర్‌సీపీ యువ నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, సుబ్బరాయుడు, మలిశెట్టి శ్రీరాములు పాల్గొన్నారు.

**మునిసిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో..**

**రాజంపేట టౌన్ :** మహాత్మాగాంధీ ఆశయ సాధనే ప్రతి భారతీయుడి లక్ష్యం కావాలని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని గాంధీ విగ్రహానికి పోలా ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిలర్లు, ఆర్యవైశ్యులు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ అహింసావాదంతోనే బ్రిటీష్ పాలకులను గడగడలాడించి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చారని, ఫలితంగా భారతీయులంతా స్వాతంత్ర ఫలాలను ఆస్వాదిస్తున్నారన్నారు. భారతీయులు స్వేచ్ఛగా జీవించేందుకు ఆ మహనీయుడు అలుపెరగకుండా సాగించిన పోరాటం ఎప్పటికీ మరువలేనిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, కౌన్సిలర్లు సనిశెట్టి నవీన్‌కుమార్, సూరి, ఆర్యవైశ్య, యువజన సంఘ, వాసవీక్లబ్ ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

**గాంధీజీ కలలు సాకారం చేయాలి**

**రైల్వేకోడూరు అర్బన్ :** జాతిపిత మహాత్మాగాంధీ దేశప్రజలకు నిర్దేశించిన అహింసా, శాంతి వంటి కలలు మనమందరం సాకారం చేయాలని సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. స్థానిక టోల్‌గేట్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం మనందరం పాటుపడాలని తెలిపారు. ఆయన సమాజ వికాసానికి ఎన్నో మార్గాలు చూపారని, ప్రపంచ శాంతి కోసం అహింసా మార్గాన్ని చూపిన మహానుబావుడన్నారు. శాంతిని కాపాడినప్పుడే దేశంలోని ప్రజలు సుభిక్షంగా ఉంటారన్నారు. సర్పంచ్ బుడుగు శివయ్య, పట్టణ కన్వీనర్ సీహెచ్.రమేష్, సుధకర్‌రాజు, రమణ, రౌఫ్ రాజా, విజయ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.